సాక్షి నిజామాబాద్

మంగళవారం | 25 | జూలై | 2023



అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచవద్దని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.

- 8లో ▸



ఫలించిన వీఆర్‌ఏల కల

ఏళ్లుగా పేస్కేల్ కోసం ఎదురుచూస్తున్న వీఆర్‌ఏల ఆశలు ఫలించాయి. ఈ సందర్భంగా సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.3 /23.9

ఆకాశం మేఘావృతమవుతుంది. ఉదయం నుంచి చిరుజల్లులు కురియవచ్చు. మధ్యాహ్నం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిజామాబాద్ ఆర్డీవోగా రాజేంద్రకుమార్



సుభాష్‌నగర్ : నిజామాబాద్ డివిజన్ ఆర్డీవోగా రాజేంద్రకుమార్ సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన టి రవి సికింద్రాబాద్ ఆర్డీవోగా బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. రాజేంద్రకుమార్ సూర్యాపేట్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అంతకుముందు ఆయన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డిని కలిశారు.

నిజామాబాద్ ఆర్‌ఎంగా జానీరెడ్డి



ఖలీల్‌వాడి : నిజామాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా సోమవారం జానీ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్‌ఎంగా పని చేసిన ఉషాదేవి వ్యక్తిగత సెలవులపై వెళ్లడంతో ఆదిలాబాద్ ఆర్‌ఎం జానీరెడ్డికి ఇన్‌చార్జీ బాధ్యతలిచ్చారు. ఆర్‌ఎం ఉషాదేవి సెలవులను పొడిగించుకోవడంతో ఇన్‌చార్జీగా ఉన్న జానీరెడ్డికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పజెప్తూ ఎండీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు.

పలు రైళ్లు రద్దు

ఖలీల్‌వాడి : సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటన చేసింది. ఈనెల 25న కర్నూల్ గుంతకల్లు–బోధన్ (07671) రైలు 26, 27, 30 తేదీల్లో నిర్ణీత సమయం కంటే 120 నిమిషాలు లేటుగా నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. 24 నుంచి 30 వరకు దండి-నిజామాబాద్ (11409) రైలు ముద్ఖేడ్-నిజామాబాద్, 25 వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నిజామాబాద్-పండరీపూర్ (01413) రైలు నిజామాబాద్-ముద్ఖేడ్ మధ్య రద్దు చేశారు. కాచిగూడ-నిజామాబాద్ (07596), నిజామాబాద్-కాచిగూడ (07593), నాందేడ్-నిజామాబాద్ (07854) రైళ్లు 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, నిజామాబాద్-నాందేడ్ (07853) రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే స్పష్టం చేసింది.

టీపీఎస్‌కు లోకాయుక్త నోటీసు

- మున్సిపల్ కమిషనర్‌కు కూడా..
- పార్క్ స్థలం కబ్జా కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ నాగారం : నగరంలోని టీఎన్జీవోస్ కాలనీలో పార్క్ స్థలం కబ్జాకు గురైందని పేర్కొంటూ 'సాక్షి'లో వచ్చిన వరుస కథనాలకు లోకాయుక్త స్పందించింది. టీఎన్జీవోస్ కాలనీ ఇన్‌చార్జి అధికారి, టౌన్‌ప్లానింగ్ టీపీఎస్ అనుపమకు, మున్సిపల్ కమిషనర్‌కు లోకాయుక్త నోటీసులు జారీ చేసింది. రిటైర్డు టీపీవో పార్క్ స్థలాన్ని కబ్జాచేశారని పేర్కొంటూ గతంలో సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. న్యూఎన్జీవోస్ కాలనీలోని గీతాంజలి స్కూల్‌వెనుక భాగంలో రిటైర్డు టీపీవో పార్కు స్థలాన్ని కబ్జా చేసి షెడ్ వేసుకున్నప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు ఆరోపించారు. ఏప్రిల్ 17న రాతపూర్వకంగా కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. అయినా పట్టించుకోకపోవడంతో కాలనీవాసులంతా కలిసి కాలనీవాసి బంటు వేణు అనే వ్యక్తి పేరుతో జూన్ 13న ఫిర్యాదు చేశారు.

కబ్జా స్థలాన్ని పరిశీలించిన ఆర్‌డీ..

పార్క్ స్థలం రిటైర్డ్ టీపీవో కబ్జా చేసిన విషయమై హైదరాబాద్ నుంచి ఆర్‌డీ నర్సింహారెడ్డి కూడా ఈనెల 7న ప్రత్యేకంగా పరిశీలించారు. పార్క్ స్థలం కబ్జాకు గురైతున్నట్లు ఆయన దృష్టిలో ఉన్నప్పటికీ పరిశీలించి వెళ్లిపోయారు. కాలనీవాసులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఏరియాకు సంబంధించిన టీపీఎస్ అనుపమ, మున్సిపల్ కమిషనర్‌కు లోకాయుక్త నోటీసులిచ్చింది. సెప్టెంబర్ 12న లోకాయుక్తలో హాజరు కావాలని ఆదేశించింది. ఈ విషయమై టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ కోసం సంప్రదించగా స్పందించలేదు.

63 టీఎంసీలకు చేరిన ప్రాజెక్ట్ నీరు

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా పెరుగుతుంది. ప్రాజెక్ట్‌లో నీటినిల్వ 63 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుత సీజన్‌లో జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 45 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. అందులో ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా కాళేశ్వరం నీరు 2.55 టీఎంసీలు వచ్చి చేరింది.

ఎన్నికల వేళ డబుల్ స్పీడ్



కాంగ్రెస్‌భవన్ వద్ద పీసీసీ అధికార ప్రతినిధి మహేశ్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



నగరంలోని ధర్నా చౌక్‌లో డబుల్ బెడ్‌రూం నిరసన దీక్షలో భాగంగా మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

- దూకుడు మరింత పెంచిన ప్రతిపక్షాలు
- ప్రజాసమస్యలపై వరుస కార్యక్రమాలు
- తీవ్రమవుతున్న విమర్శలు
- డబుల్ బెడ్‌రూం ఇళ్లపై కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ నిరసనలు
- కేంద్ర నిధులు పక్కదారి.. ఇళ్లకు రూ.30 వేల కోట్లు కేటాయించి ఖర్చు చేయలేదు
- కేసీఆర్ కుటుంబంపై విరుచుకుపడిన ఎంపీ అర్వింద్
- పీసీసీ అధికార ప్రతినిధి మహేశ్ కొనగాలను అడ్డుకున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ నడుస్తున్న నేపథ్యంలో పార్టీలు క్షేత్రస్థాయి కార్యకలాపాల్లో స్పీడ్ పెంచాయి. ముఖ్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నిలదీసే విధంగా కాంగ్రెస్, బీజేపీలు కార్యక్రమాలు రూపొందించుకుని ముందుకు వెళుతున్నాయి. ఇప్పటికే విడతల వారీగా అనేక కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతున్న ఆయా పార్టీలు ప్రజాసమస్యలపై మరింతగా దృష్టి సారించాయి. ఈ క్రమంలో తాజాగా రెండు జాతీయ పార్టీలు ఒకేసారి ఒకే అంశంపై కార్యక్రమం నిర్వహించాయి. కీలకమైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయమై బీఆర్‌ఎస్‌పై విమర్శలు గుప్పించాయి. కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు నిజామాబాద్ నగరంలో కొత్త కలెక్టరేట్ సమీపంలో డబుల్ ఇళ్లను ఆ పార్టీ నాయకులతో పరిశీలించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు రాష్ట్ర పార్టీ నుంచి ఇన్‌చార్జిగా పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ మహేశ్ కొనగాల వచ్చారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం కమీషన్లు వచ్చే పనులకు మాత్రమే నిధులు ఇచ్చిందన్నారు. పేదలకు అన్యాయం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేశారు.

మరోవైపు ఇదే డబుల్ బెడ్‌రూం ఇళ్ల అంశంపై బీజేపీ ధర్నా కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబంపై విమర్శల వర్షం కురిపించారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కేంద్రం నుంచి వచ్చిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిధులు, కేసీఆర్ ప్రభుత్వం బడ్జెట్‌లలో కేటాయించిన నిధులు తదితర గణాంకాలతో పాటు రాష్ట్ర ఆడిట్ విభాగం ఇచ్చిన నివేదికల ఆధారంగా విరుచుకుపడ్డారు. కేసీఆర్ కుటుంబం ఇష్టం వచ్చినట్లు చేస్తోందన్నారు. తెలంగాణకు పట్టిన దరిద్రం కేసీఆర్ అన్నారు. కేసీఆర్ ఉన్నంతవరకు ఎవ్వరికీ ఏమీ రావని ఎంపీ అన్నారు. కేంద్ర నిధులను పక్కదారి పట్టించడంతో పాటు బడ్జెట్‌లో కేటాయించిన రూ.30 వేల కోట్ల నిధులను సైతం ఇవ్వకుండా పేదలకు అన్యాయం చేశారన్నారు. మహిళలకు డబుల్ ఇళ్లు ఇవ్వకుండా మరోవైపు దళితబంధు, బీసీ బంధు, మైనారిటీ బంధు ఇస్తానంటూ మోసం చేస్తున్నారన్నారు. భీంగల్‌లో బస్‌డిపో ఏర్పాటు చేసేందుకు డబ్బులు లేవంటున్నార న్నారు. ఆర్టీసీని

కేసీఆర్ ముక్కునే నేలకు రాయిస్తానన్న ఎంపీ అర్వింద్..

తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్న అర్వింద్ ముక్కు నేలకు రాయాలని కల్వకుంట్ల కవిత అన్న విషయమై అర్వింద్ కౌంటర్ ఇచ్చారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని కేసీఆర్ ముక్కునే గజ్వేల్‌లో నేలకు రాయిస్తానని అర్వింద్ వ్యాఖ్యానించడం గమనార్హం. నిజామాబాద్ జిల్లాలో 12 వేల ఇళ్లు కట్టిస్తానని చెప్పి ఇచ్చింది ఏమీలేదన్నారు. ఇక ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో కవిత పాత్ర విషయమై సీబీఐ, ఈడీ చూసుకుంటాయని ఎంపీ అర్వింద్ వ్యాఖ్యానించారు.

ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి అప్పగిస్తే ఆర్టీసీకి నష్టాలు రాకుండా లాభాలు వస్తాయా అని ఎంపీ ప్రశ్నించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి గంజాయి వ్యాపారులను ప్రోత్సహిస్తున్నారని ఎంపీ అర్వింద్ విమర్శించారు.

అధికార బీఆర్‌ఎస్ సైతం ఇటీవల విద్యుత్ అంశంపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను విమర్శిస్తూ అన్ని సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. రేవంత్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఇందుకు ప్రతిగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సైతం అన్ని సబ్‌స్టేషన్‌ల వద్ద కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ నేపథ్యంలో రానురాను పార్టీల మధ్య విమర్శల వర్షం పెరుగుతోంది.

కేసీఆర్ ఉన్నంతకాలం పేదలకు ఇండ్లు రావు..

- 'గృహలక్ష్మి'కి నయా పైసా ఇవ్వలేదు
- ఏడు అసెంబ్లీ స్థానాలు బీజేపీవే..
- 'డబుల్ బెడ్‌రూం' నిరసన సభలో ఎంపీ ధర్మపురి

సుభాష్‌నగర్ : కేసీఆర్ ఉన్నంతకాలం పేదలకు ఇళ్లు రావని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పాత కలెక్టరేట్ వద్ద డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ సీఎంగా, నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నంత కాలం ఇళ్లు రావని ఎద్దేవా చేశారు. 2014, 2018 ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన ముఖ్యమైన హామీ డబుల్ బెడ్‌రూం ఇళ్లని, ఇప్పటిదాకా 20 వేల ఇళ్లు కూడా ఇవ్వలేదన్నారు. 2020–21 నుంచి 2022–23 వరకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ప్రభుత్వం రూ. 18,500 కోట్లు కేటాయించిందని, కానీ నయా పైసా ఖర్చు చేయలేదన్నారు. తాజాగా ఇప్పుడు గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు ఇస్తామంటున్నారన్నారు. రూ. 10 వేల కోట్లు కాళేశ్వరంలో కమీషన్ రూపంలో కల్వకుంట్ల కుటుంబం తీసుకుందని ఆరోపించారు. ఇటీవల బడ్జెట్‌లో 4 లక్షల ఇండ్ల నిర్మాణానికి గృహలక్ష్మి పథకం కింద రూ. 12 వేల కోట్లు కేటాయించారని, కానీ ఆ నిధులు సీఎం ఆవాస్ యోజనకు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని అధ్యయన కమిటీ నివేదికలో వెల్లడైందన్నారు. భీమ్‌గల్ డిపో నిర్మాణానికి నిధుల్లేవని మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొనడం హాస్యాస్పదమని, జీవన్‌రెడ్డి లాంటి వారికి ఆర్టీసీ స్థలాన్ని అప్పగిస్తే లాభాల్లో ఎలా ఉంటుందని ఎద్దేవా చేశారు. గంజాయి సరఫరా విషయంలో బీఆర్‌ఎస్ నాయకులు, తన కుటుంబ సభ్యులెవరూ ఫోన్ చేసినా ఉపేక్షించవద్దని మంత్రి ప్రశాంత్‌రెడ్డి పోలీసులకు చెప్పడంపై అనేక సందేహాలున్నాయన్నారు. పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు.

కబ్జాలపైనే అధిక శ్రద్ధ : ధన్‌పాల్



అర్బన్‌లో ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా కబ్జాలపైనే అధిక శ్రద్ధ పెట్టాడని, పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ధ్యాస లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. త్వరలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలతో కలిసి పరిశీలిస్తామన్నారు. జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్లపేరుతో ఇప్పటికే ప్రజలను కేసీఆర్ రెండుసార్లు మోసం చేశారని, గృహలక్ష్మి పేరుతో మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారని, రూరల్ ఎమ్మెల్యే ఆస్తులు పెరుగుతున్నాయి తప్ప పేదలకు ఇళ్లు అందట్లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, అధికార ప్రతినిధి అల్జాపూర్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దోళ్ల గంగారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దినేష్ కులాచారి, రాకేష్‌రెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో మోర్చాలు, అసెంబ్లీ, పార్లమెంట్ కన్వీనర్లు గద్దె భూమన్న, లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, కంచెట్టి గంగాధర్, స్రవంతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, శివ ప్రసాద్, కార్పొరేటర్లు తదితరులున్నారు.

వైఫల్యాలు బయటికొస్తాయనే భయం



మాట్లాడుతున్న మానాల మోహన్ రెడ్డి

ఖలీల్‌వాడి : బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలు బయటపడ్తాయనే భయంతోనే కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేశారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను చూసేందుకు రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి మహేశ్ కొనగాల జిల్లాకు వస్తే బీఆర్‌ఎస్ అడ్డుపడడం సరైంది కాదన్నారు. మూడురోజుల కూడా నడపని రివర్స్‌పంపింగ్ కోసం రైతులను బస్సుల్లో తీసుకెళ్లి చూపించిన మంత్రి ప్రశాంత్ రెడ్డి డబుల్ ఇళ్లను చూసేందుకు వస్తే ఎందుకు అరెస్ట్ చేయించారన్నారు. జిల్లా మాజీ పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, జిల్లామహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీరడి భాగ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మీసాల సుధాకర్‌రావు, సాయిబాబాగౌడ్, సుభాష్ జాదవ్ పాల్గొన్నారు.

కమీషన్లు వచ్చే ప్రాజెక్టులకే నిధులు..

- టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహేశ్ కొనగాల
- కాంగ్రెస్‌భవన్ వద్ద కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు

ఖలీల్‌వాడి/సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం కమీషన్ల కోసమే పనిచేస్తోందని, కమీషన్లు వచ్చే ప్రాజెక్టులకే నిధులు కేటాయిస్తోందని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వని బీఆర్‌ఎస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో తరిమి కొట్టాలని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహేశ్ కొనగాల అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్ నుంచి జిల్లా కలెక్టరేట్ సమీకృత భవన్ సమీపంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించడానికి వెళ్తున్న టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహేశ్ కొనగాలతో పాటు టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీరడి భాగ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి నాల్గో, ఐదో టౌన్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. వాహనాలను అడ్డుకున్న యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రీతమ్, సాగర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి అనంతరం వదిలేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి మహేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లిచ్చామన్నారు. సీఎం కేసీఆ ర్ 2014, 2018 ఎన్నికల్లో డబుల్‌బెడ్‌రూం పేరుతో అబద్ధపు హామీలు ఇచ్చారన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తి గోపి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్, వేణురాజ్, జావిద్ అక్రమ్, గడుగు రోహిత్, సుధాకర్ రావు, దయాకర్ గౌడ్, రాంభూపాల్ ఉన్నారు.

రక్షణ కరువైన జింకలు

- గుంపులుగా వేటాడుతున్న కుక్కలు
- చిన్నయానం వద్ద మరో జింక మృతి
- ఈ నెలలో ఇది రెండో ఘటన

డొంకేశ్వర్ (ఆర్మూర్) : ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో వన్య ప్రాణులకు రక్షణ కరువైంది. కుక్కలు జింకలను యథేచ్ఛగా వేటాడి పీక్కు తింటున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కుక్కలు దాడి చేసి తిన్న జింకలను పట్టుకు రావడం, వాటిని పోస్టుమార్టం చేసి అక్కడే దహనం చేయడం తప్ప మరేం చేయలేకపోతున్నారు. సోమవారం చిన్నయానం పచ్చిక బయళ్ల వద్ద జింకను వేటాడిన కుక్కలు దానిని పీక్కు తింటున్న ఉదంతం వెలుగు చూసింది. ఈ నెలలో ఇది రెండో ఘటన. ఇరవై రోజుల క్రితమే కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన కృష్ణ జింకకు వైద్యం అందించినా చివరికి అది ప్రాణాలొదిలింది. ఈ ఘటనను మరువకముందే మరో జింకను కుక్కలు వేటాడి చంపడం కలచివేస్తుంది. కురుస్తున్న వర్షాలకు ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతానికి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో లోపలి ప్రాంతాల్లో విహరించే జింకలు ఒడ్డు ప్రాంతానికి వస్తున్నాయి. తద్వారా జింకలను వేటాడడం కుక్కలకు మరింత సులువైంది. మాటువేసి మరీ గుంపులుగా వేటాడుతున్నాయి. కుక్కలు పచ్చిక బయళ్లవైపు రాకుండా ఎన్ని విధాలుగా చర్యలు చేపట్టినా అవి ఫలితాన్నివ్వడం లేదు. గంగా సముందర్, నూత్‌పల్లి, చిన్నయానం, నడ్కుడ, గాదేపల్లి, అన్నారం, డొంకేశ్వర్, నికాల్‌పూర్ గ్రామాలకు ఆనుకుని కొన్ని కిలో మీటర్ల మేర ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతం ఉంది. కుక్కలు ఒకచోటి నుంచి మరో చోటికి వెళ్లడంతో వాటిని పట్టుకోవడం ఎవరికీ సాధ్యం కావడం లేదు. అయితే, ఇక్కడ నిత్యం ఫారెస్టు అధికారుల పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం ఉంది. నందిపేట్, డొంకేశ్వర్ మండలానికి కలిపి ఒకే అధికారి ఉండడంతో పర్యవేక్షణ చేయడం కష్టమవుతోంది. కుక్కల దాడితో ఇప్పటికే పదుల సంఖ్యలో జింకలు మృత్యువాత పడ్డాయి. దీంతో వాటి సంఖ్య కూడా క్రమంగా తగ్గుతూ కనుమరుగవుతున్నాయి. ఎకో టూరిజం ఏర్పాటయ్యే సరికి అవి ఉంటాయో లేదోనని అనుమానంగానే ఉంది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా చర్యలు చేపట్టి వన్య ప్రాణులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చిన్నయానం వద్ద జింకను వేటాడి పీక్కు తింటున్న కుక్కలు



పెరుగుతున్న డెంగీ కేసులు

- వర్షాకాలం జాగ్రత్తలు అవసరం
- ఏడాదిలో 30 కేసుల నమోదు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో సమాచారం లేదంటున్న అధికారులు



జీజీహెచ్‌లో ఓపీ కౌంటర్ వద్ద రోగుల క్యూ

మూడేళ్లలో డెంగీ కేసులిలా..

ఏడాది	2020	2021	2022	7 నెలల్లో
కేసుల సంఖ్య	58	396	189	30

నిజామాబాద్ సిటీ : జిల్లాలో గతకొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ, మలేరియా, విషజ్వరాలు, డయేరియా ప్రబలే అవకాశాలున్నాయి. వర్షాలకు ప్రజలపై జ్వరాల ప్రభావం కనిపిస్తోంది. దీంతో జీజీహెచ్‌లో నిత్యం జ్వరాలతో రోగులు క్యూ కడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో డెంగీ కేసులు అధికారికంగా 30 నమోదైనట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. కాగా ప్రైవేట్ ఆసుపత్రులలో నమోదవుతున్న కేసుల వివరాలు మాత్రం బయటకు రావట్లేదు. ఇప్పటికే వైద్య శాఖ అధికారులు వానాకాలం సీజనల్‌లో వచ్చే వ్యాధులపై పీహెచ్‌సీ, జిల్లా స్థాయిలో సమీక్ష సమావేశాలలో వ్యాధుల కట్టడికి చేపట్టాల్సిన కార్యాచరణపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఇటీవల కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కూడా వైద్యా ఆరోగ్యశాఖాధికారులతో సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించి సూచనలు సలహాలు అందజేశారు.

ఈ ఏడాదిలో..

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూలై నెల వరకు 30 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. పై కేసులన్నీ ప్రభుత్వ ఆస్పత్రిలో నమోదైనవి మాత్రమే కాగా, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి వివరాలు బయటకు రావట్లేదు. నిజామాబాద్ అర్బన్‌లో 12 కేసులు, బోధన్ పట్టణంలో 5, మోపాల్ మండలలో 4 కేసులు, ఇందల్వాయి, మోస్రా, రెంజల్, బినోలా, ఆర్మూర్ పట్టణాల్లో ఒక్కో కేసు నమోదైంది.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో గోల్‌మాల్..

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రిలో డెంగీకు చికిత్స పొందుతున్న వారి వివరాలు ప్రభుత్వానికి తెలపాల్సి ఉన్నప్పటికీ వారు ఎలాంటి సమాచారం ఇవ్వట్లేదు. అధికారులకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో నిజంగా కేసులు నమోదవుతున్నాయా లేదా అనేది కూడా అనుమానమే.. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన కేసులను బట్టి వైద్యశాఖ ఆయా ప్రాంతాల్లో చర్యలు తీసుకుంటున్నారు.

“ సమాచారం ఇవ్వట్లేదు..

సీజనల్‌లో వచ్చే వ్యాధుల వివరాలు ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి వస్తుంది కాని ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి రావట్లేదు. ప్రైవేట్ ఆస్పత్రులకు నోటీసులు కూడా ఇచ్చాం. అయినా నిర్లక్ష్యం చేస్తున్నారు. కలెక్టర్ నుంచి స్పష్టమైన ఆదేశాలొస్తేనే స్పందిస్తారనిపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రిలో డెంగీ కేసు నమోదైతే ఆ ఇంటి చుట్టుపక్కన 50 ఇళ్లలో ఆరోగ్యకార్యకర్త సర్వే చేస్తుంది. దోమలు పెరగకుండా నివారణ చర్యలు తీసుకుంటారు. ఈ టీంలు ప్రస్తుతం బోధన్, నిజామాబాద్, ఆర్మూర్ పట్టణాల్లో సర్వే చేస్తున్నారు. ఆరోగ్యమంత్రి హరీష్‌రావు సూచన మేరకు ప్రతి ఆదివారం ఎవరింట్లో వారు 10 నిమిషాలు ఇళ్లను శుభ్రం చేసుకునేలా ప్రచారం చేస్తున్నాం.

– తుకారాం రాథోడ్, జిల్లా మలేరియా అధికారి

వారం రోజుల్లో పనులు ప్రారంభించాలి

అసెంబ్లీ స్పీకర్ పోచారం

రుద్రూర్ : గ్రామాల అభివృద్ధికి మంజూరు చేసిన పనులు వారం రోజుల్లో ప్రారంభించాలని లేనట్లయితే రద్దు చేస్తామని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కోటగిరి, పోతంగల్ మండల కేంద్రాల్లో సోమవారం అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాన్సువాడ నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి కోట్లల్లో నిధులిస్తే పనులు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తపల్లి పనుల్లో వెనుకబడడంపై అసహనం వ్యక్తం చేశారు. వీటిని రద్దు చేసి ఇతర గ్రామాలకు కేటాయిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ భవనాలను పూర్తి చేసేందుకు అదనంగా మరో రూ. 2 లక్షలు మంజూరు చేస్తామన్నారు. డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు బిల్లులు విడుదలైనట్లు స్పీకర్ వెల్లడించారు. కోటగిరి మండల లబ్ధిదారులకు మంగళవారం మధ్యాహ్నం రుద్రూర్ మండల కేంద్రంలో అందచేస్తారన్నారు. ఈ సమావేశంలో బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ కిరణ్‌కుమార్, జెడ్పీటీసీ శంకర్ పటేల్, ఏఎంసీ చైర్మెన్ అబీద్, వైస్ చైర్మెన్ కల్లూర్ రామిరెడ్డి, కోటగిరి సర్పంచ్ పత్తి లక్ష్మణ్ తదితరులున్నారు.



కోటగిరిలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఐటీఐలో డీజిల్ మెకానిక్ పూర్తి చేసిన వారికి ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేయడానికి అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్‌ఎం జానిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు www.apprenticesshipindia.org లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిని మెరిట్ ప్రతిపాదకన సెలెక్ట్ చేసుకుంటామన్నారు. నిజామాబాద్ రీజినల్ పరిధిలోని ఆరు డిపోలలో అవసరం మేరకు ఐటీఐ అప్రెంటిస్ షిప్ కోసం కేటాయిస్తామన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేడు నగరంలో జాబ్ మేళా

నిజామాబాద్‌అర్బన్: నేడు జిల్లా కేంద్రంలో ఎంఎస్‌ఎం ల్యాబరేటరి ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇంటర్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల (ఖిల్లా)లో ఉదయం 11 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఫార్మ, ఎంఎల్‌టీ, పూర్తి చేసి 60శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు 2 జతల జిరాక్స్ పత్రాలుతో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో పనిచేసేందుకు నెలకు రూ.11వేల వేతనంతో పాటు సబ్సిడీ క్యాంటీన్, వసతి కల్పించబడుతుందని తెలిపారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి: తమిళనాడులోని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు నిజామాబాద్ నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడపాలని ఆర్టీసీ సంస్థ నిర్ణయించినదని ఆర్‌ఎం జానిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులకు సంస్థ నియమనిబంధనలకు అనుసరించి ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం వారి కాలనీలలో 30మంది ప్రయాణికులు ఉన్న ఎడల వారి వద్దకే బస్సు పంపించబడుతుందన్నారు. ఆసక్తి గల వారు డిపో మేనేజర్, నిజామాబాద్-1 – 9959226016, డిపో మేనేజర్, నిజామాబాద్-2 – 9959226017, డిపో మేనేజర్, కామారెడ్డి – 9959226018ను సంప్రదించాలని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరమ శివుడి అనుగ్రహం పొందాలని తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామాన్ని స్వచ్ఛ సర్వే క్షణ్ గ్రామీణ బృంద సభ్యులు సోమవారం సందర్శించారు. గ్రామంలో పల్లె ప్రగతిలో భాగంగా చేప ట్టిన అభివృద్ధి పనులను, అంగన్‌వాడీ కేంద్రాలను, ఇంకుడు గుంతలను, వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్రభు త్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మరుగు దొడ్ల వినియోగాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బృందం లీడర్ ఫయాజ్, ఎంపీడీవో అనంత్ రావు, ఎంపీవో ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

సుభాష్‌నగర్: ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ పెట్టొద్దని, సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 139 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్, డీపీఓ జయసుధలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఏ ఏ శాఖల్లో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలను అదనపు కలెక్టర్ యాదిరెడ్డి వెల్లడిస్తూ, వారం లోపు వాటన్నింటిని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం తెలియజేస్తూ, ప్రజావాణి సైట్‌లో పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

డైట్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి..

నాగారంలోని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ప్రధానకార్యదర్శి కర్క గణేష్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా గణేష్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఏళ్ల నుంచి బది లీలు లేకుండా ఇక్కడే తిష్ట వేశారని, విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు తరుణ్, లక్ష్మణ్, శామ్యూల్ ఉన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ టోర్నీకి జిల్లా ఉద్యోగులు

నిజామాబాద్‌నాగారం: అఖిల భారత విద్యుత్ ఫుట్‌బాల్ టోర్నీకి జిల్లా విద్యుత్ ఉద్యోగులు ఎంపికయ్యారు. ఈ నెల 26నుంచి 29వరకు కోలకతాలో జరిగే అఖిల భారత విద్యుత్ ఫుట్‌బాల్ టోర్నీకి తెలంగాణా జట్టు కెప్టెన్‌గా జిల్లాకు చెందిన ఏపీటీఎస్ సీఐ సురేష్ వ్యవహరించనున్నారు. ఈ టోర్నీలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 17మంది క్రీడాకారులను స్పోర్ట్ కౌన్సిల్ ఎంపిక చేసింది. వీరిలో జిల్లాకు చెందిన ఆర్ బలేష్ కుమార్(ఏడీఈ), కామారెడ్డి నుంచి గోపీ, దినేష్, ఉన్నారు. క్రీడాకారులను జిల్లా విద్యుత్ ఎస్ఈ రవీందర్, డీఈటీ రమేష్, స్పోర్ట్స్ కౌన్సిల్ వర్కింగ్ ప్రెసిడెంట్ తోట రాజశేఖర్, కార్యదర్శి గంగారం నాయక్, కోశాధికారి సురేష్ అభినందించారు.


టోర్నీకి ఎంపికైన ఉద్యోగులను అభినందిస్తున్న ఎస్ఈ రవీందర్

పాలిటెక్నిక్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని వివిధ కోర్సులలో మిగిలిన సీట్ల కోసం ఈనెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీరాంకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో ఖాళీల వివరాలను ఈనెల 25న ప్రదర్శిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 27వరకు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. సీ

మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించన్నట్లు ప్రిన్సిపాల్ నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్స్ ఈసీఈ ఇంజనీరింగ్ విభాగాల్లో సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఈనెల 25నుంచి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకొని, 28న స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలన్నారు.

తెయూ ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా ఘంటా చంద్రశేఖర్

- పీఆర్‌వో డైరెక్టర్‌గా పున్నయ్య


ఘంటా చంద్రశేఖర్‌కు, పున్నయ్యకు నియామక పత్రాలను అందజేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి సోమవారం వివిధ పరిపాలనా పోస్టులకు నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్‌గా అతిక్ సుల్తాన్ ఘోరీ, డైరెక్టర్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా ఏ పున్నయ్యను నియమించారు. ఈ మేరకు సోమవారం వారికి నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, అతిక్, పున్నయ్యలు మాట్లాడుతూ.. యూనివర్సిటీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తమపై నమ్మకంతో నియమించిన ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

టైలరింగ్‌తో స్వయం ఉపాధి


మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్

డిచ్‌పల్లి: టైలరింగ్ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని తద్వారా ఆర్థికంగా ఎదగాలని నిజామాబాద్ నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. డిచ్‌పల్లిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) అధ్వర్యంలో మహిళలకు ఇస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ శిక్షణ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నిపుణులైన ట్రైనర్స్ ఇచ్చే శిక్షణను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. టైలరింగ్‌కు మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఇంట్లోనే ఉండి స్వయం ఉపాధి పొందడానికి, సొంత కాళ్లపై నిలబడి ఆర్థికంగా ఎదిగేందుకు కుట్టుపని ఒక చక్కని అవకాశమన్నారు. అనంతరం సంస్థ ఆవరణలో డీడీఎం ప్రవీణ్‌కుమార్ మొక్క నాటారు. సంస్థ డైరెక్టర్ ఎస్ శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మీ, రామకృష్ణ, రంజిత్, నవీన్, ఫ్యాకల్టీ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కామారెడ్డిలో దొంగల హల్‌చల్



కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గంజ్‌లోని ఓ దుకాణం ప్రధాన గేటు సహా దుకాణం తలుపులకు ఉన్న తాళాలు పగలగొట్టారు. నగదు, విలువైన వస్తువులు లభించకపోవడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. సోమవారం తెల్లవారుజామున యజమాని అశోక్ దుకాణం తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, విచారణ జరిపారు.

రెండు ఆలయాల్లో చోరీ...

జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో ఉన్న వాల్మీకి ఆలయం, హనుమాన్ ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీలను ధ్వంసం చేసి దాదాపు రూ.20వేల నగదును ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నెరవేరిన వీఆర్‌ఏల కల

- పేస్కేల్ వర్తింపచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- విద్యార్హతల ఆధారంగా పోస్టులు


రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ నినాదాలు చేస్తున్న మోర్తాడ్ వీఆర్‌ఏలు

మోర్తాడ్(బాల్కొండ)/సుభాష్‌నగర్: పేస్కేల్ కోసం సుదీర్ఘకాలం ఎదురు చూసిన గ్రామ రెవెన్యూ అసిస్టెంట్(వీఆర్‌ఏ)ల కల సాకారం కానుంది. వీఆర్‌ఏలకు పే స్కేల్‌ను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 81ను సోమవారం విడుదల చేయడంతో వారి ఆశలు ఫలించాయి. వీఆర్‌ఏల విద్యార్హతలను పరిగణలోకి తీసుకుని వివిధ హోదాల్లో భర్తీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీఆర్‌ఏలను ఇతర శాఖల్లోనే విలీనం చేయడానికి ప్రభుత్వం మొగ్గుచూపింది. పదో తరగతి వరకు చదువుకున్న వారికి లాస్ట్ గ్రేడ్ సరీస్, ఇంటర్ వరకు చదువుకున్న వారిని రికార్డు అసిస్టెంట్‌లుగా, డిగ్రీ, ఆపై చదువులు చదువుకున్న వారిని జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లలో భర్తీ చేయనున్నారు. ఎక్కువ మంది వీఆర్‌ఏలను నీటిపారుదల శాఖలో కేటాయించే అవకాశం కనిపిస్తుంది.

జిల్లాలోని 1,624 మంది..

జిల్లాలో 452 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అందులో 1,624మంది వీఆర్‌ఏలు పనిచేస్తున్నారు. వీరిలో ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ ద్వారా 130 మంది వరకు నియమితులయ్యారు. సుమారు 1,494 మంది వారసత్వంగా వీఆర్‌ఏలుగా పని చేస్తున్నారు. వీరిలో పీజీ చదివిన వారు 69 మంది, డిగ్రీ పూర్తి చేసిన వారు 158, ఇంటర్ చదివిన వారు 220, ఎస్సెస్సీ 260, నిరక్షరాస్యుల నుంచి ఏడోతరగతి వరకు చదివిన వారు 792 మంది ఉన్నారు. 61 ఏళ్లలోపు వారందరికీ పే స్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు. అంతేగాకుండా 61 ఏళ్లపైబడిన వారి వారసులకు ఉద్యోగాలు వర్తింపజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్నో ఏళ్ల నుంచి తక్కువ గౌరవ వేతనంపై పని చేస్తున్న తమకు పేస్కేల్ వర్తింపచేయాలని వీఆర్‌ఏలు డిమాండ్ చేస్తూ, గతేడాది రోజుల పాటు సమ్మె నిర్వహించారు. త్వరలోనే వీఆర్‌ఏలకు పే స్కేల్‌ను వర్తింప చేస్తామని రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ హామీ ఇవ్వడంతో వారు సమ్మె విరమించారు. చివరకు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడంతో వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పే స్కేల్, వారసులకు ఉద్యోగాలు వీఆర్‌ఏల 80 రోజుల సమ్మె ఫలితమేనని వారు పేర్కొంటున్నారు. వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని వీఆర్‌ఏ జేఏసీ ప్రతినిధులు పేర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు చేస్తున్నారు.

పీజీ పరీక్షల్లో 57 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న ఎంబీఏ, ఎంసీఏ, ఐఎంబీఏ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన పరీక్షకు 57 మంది గైర్హాజరైనట్లు పరీక్షల నియంత్రణాధికారి (కంట్రోలర్) ప్రొఫెసర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ, 2వ సెమిస్టర్, ఐఎంబీఏ 8వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 620 మంది విద్యార్థులకు గానూ 578 మంది హాజరు కాగా 42 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ 4వ సెమిస్టర్, ఐఎంబీఏ 10వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు 319 మంది విద్యార్థులకు గానూ 304 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

సుభాష్‌నగర్: భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా వివిధ మండలాలకు నూతన మండల అధ్యక్షులను పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య సోమవారం నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పేరు	మండలం	పేరు	మండలం
		కొత్తూర్ గంగాధర్	ఆలూరు
గడ్డం సంతోష్‌రెడ్డి	ముప్కాల్	ద్యాగ నరీన్	నవీపేట్
కోమన్‌పల్లి నడిపి సాయన్న	మెండోరా	నాగులపల్లి గోపికృష్ణ	రెంజల్
కర్నె లక్ష్మీనర్సయ్య	భీంగల్ టౌన్	కోల ఇంద్రకరణ్	ఎడపల్లి
ద్యాగ ఉదయ్‌కుమార్	ఆర్మూర్ టౌన్	రాజురే మనోహర్	బోధన్ రూరల్
రామావత్ సురేష్ నాయక్	మాక్లూర్	గోనె ప్రవీణ్	సాలూరు
పోతుగంటి సురేందర్	డొంకేశ్వర్	ఆనంద్	ముబారక్‌నగర్

తండ్రిని పోషించని కొడుకు

–చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు తండ్రి ఫిర్యాదు



మాచారెడ్డి: తనకు బుక్కెడు బువ్వ పెట్టకుండా వేధింపులకు గురిచేస్తున్న కొడుకుపై చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని ఓ తండ్రి అధికారులను ఆశ్రయించాడు. వివరాలు ఇలా.. పాల్వంచ మండలం బండరామేశ్వరపల్లి గ్రామానికి చెందిన మాదాసు బాల్‌రాజుకు భార్య కొన్నేళ్ల క్రితం చనిపోగా, ఒక కుమారుడు ఉన్నాడు. ఒక్కగానొక్క కొడుకని అల్లారుముద్దుగా పెంచి, పెళ్లి చేశాడు. తాను సంపాదించిన ఆరెకరాల భూమి నుంచి కొడుకు రాజయ్య పేరిట మూడు ఎకరాలు, తన పేరిట మరో మూడెకరాలు పట్టా చేయించుకున్నాడు. ప్రస్తుతం తాను అనారోగ్యం బారిన పడ్డాననీ, ఈ సమయంలో పోషించాల్సిన కొడుకు, కోడలు, మనవడు తనను నిర్లక్ష్యం చేస్తున్నారని బాల్‌రాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పలుమార్లు పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. దీంతో సోమవారం వృద్ధుల సంఘానికి అందజేసిన ఫిర్యాదు ప్రతులను కలెక్టర్‌తో పాటు కామారెడ్డి ఆర్డీవో, పాల్వంచ తహసీల్దార్‌లకు అందజేశారు. తన కొడుకు, కోడలు వారి పిల్లలపై చర్య తీసుకొని తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

కనీస వేతనాలు చెల్లించాలని వినతులు

కామారెడ్డి రూరల్/ఎల్లారెడ్డి రూరల్: కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేర్వేరుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్షణమే ఉద్యోగులను క్రమబద్ధకరించాలని కోరారు.

క్రైం కార్నర్

మహిళ అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన అవధూత సంతోషి(46) అనే మహిళ అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈనెల 22న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు. ఆమె కుటుంబసభ్యులు చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె కుమారుడు అక్షయ్ సోమవారం దేవునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి


నాగవ్వ (ఫైల్)

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో శతాధిక వృద్ధురాలు తోత్త్ల నాగవ్వ(102) సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈమె మూడు తరాల వారసులను కళ్లరా చూసినట్లు కుటుంబీకులు తెలిపారు. అంతేకాకుండా ఈమెకు పాల పండ్లు కూడా వచ్చినట్లుగా పేర్కొన్నారు. ఈమె వారం రోజుల క్రితం వరకు తన పనులు తనే చేసుకుంటూ కాలం వెళ్లదీసినట్లు తెలిపారు. పూర్తి ఆరోగ్యంగా ఉండేదన్నారు. అయితే నాగవ్వకు ఒక కూతురు ఎల్లవ్వ కాగా ఎల్లవ్వకు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. వీరిద్దరికి ఇద్దరు కొడుకుల చొప్పున ఉన్నారు. అయితే వారి మనువలకు కూడా ఇద్దరు కొడుకుల చొప్పున ఉన్నారు. వీరే మునిమనుమలు. వీరందరిని కండ్లరా చూసి నాగవ్వ మురిసిపోయినట్లు తెలిపారు.

ఆటో యజమానికి జరిమానా

కామారెడ్డి టౌన్: పట్టణ శివారులోని గణపతి సచ్చిదానంద ఆశ్రమం ప్రాంతంలో చికెన్ వ్యర్థాలను పడేసిన ఆటో యజమానికి మున్సిపల్ అధికారులు సోమవారం భారీగా జరిమానా విధించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే, దుర్గంధం వచ్చే వ్యర్థాలను ఆటోలో తీసుకువచ్చి పట్టణానికి సమీపంలో వేయడంతో అతడికి రూ. 5వేలు జరిమానా విధించారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలను వేయవద్దని సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ హెచ్చరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని జోగిన చిన్న రాజయ్యకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. సోమవారం ఇంటిలోని వారందరూ పొలం పనుల నిమిత్తం చేను వద్దకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇల్లు కాలిబూడిద అయింది. దుస్తులు, నిత్యవసర సరుకులు, బీరువాలోని నగదు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. తనకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులోని లక్ష్మినగర్ తండా సమీపంలో జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడి ఒకరు మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. దోమకొండకు చెందిన క్యాదరి శివకుమార్ (39) ఆదివారం కామారెడ్డిలో ఉన్న తన బావ ఇంటికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి అదే రోజు రాత్రి బైక్‌పై దోమకొండకు వస్తుండగా లక్ష్మినగర్ తండా సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌కు గేదె అడ్డం వచ్చింది. దీంతో శివకుమార్ బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సలహ మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తల్లి క్యాదరి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

తలకొరివి పెట్టిన తల్లి



దోమకొండలో శివకుమార్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించగా, తల్లి కళావతి కుమారుడుకి తల కొరివి పెట్టింది. మృతుడు శివకుమార్ ఇటీవల గ్రామంలో సొంత ఇంటి నిర్మాణం చేసుకుని వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. భార్య శిల్పతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య రెండు నెలల బాలింత. కుమారుడు జన్మించిన రెండు నెలల లోపే అతడు మృతిచెందాడని కుటుంబ సభ్యులు రోధించారు.ఈ ఘటన గ్రామంలో విషాదచాయలు నింపాయి. తల్లికి కుమారుడు తల కొరివి పెట్టాల్సి ఉండగా, తల్లే కుమారుడికి తల కొరివి పెట్టిందంటూ బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు



దోమకొండ: దోమకొండ మండల కేంద్రానికి చెందిన చింతల లక్ష్మీనర్సవ్వ (86) సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా, కూతురు వెంకటలక్ష్మి తల్లికి తల కొరివిపెట్టారు. మృతురాలు లక్ష్మీనర్సవ్వ గతంలో గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఆమెకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భర్త బాలయ్య గతంలో కరోనాతో మృతిచెందారు. లక్ష్మీనర్సవ్వ మృతిచెందగా, చిన్న కూతురు వెంకటలక్ష్మి తల్లికి తలి కొరివి పెట్టింది. ఈ ఘటన చూపరులను కన్నీటి పర్యంతం చేసింది.

పోచమ్మ ఆలయంలో చోరీ


దొంగలు పగలగొట్టిన హుండీ

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని పోచమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న డబ్బులను అపహరించుకపోయారు. సర్పంచ్ వేములపల్లి సుబ్బారావు మాట్లాడుతూ.. గత నెల రోజులుగా హుండీని తెరవలేనందున సుమారు రూ: 5వేల నుంచి 10వేల వరకు నగదు ఉంటాయని తెలిపారు. చోరీపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధురాలి ఆత్మహత్య



పిట్లం(జుక్కల్): జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధురాలు నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై విజయ్‌కొండ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన కటికే రుక్కవ్వ (70) గృహిణి, కొన్నేళ్ల క్రితం భర్త మృతిచెందడంతో, జీవితంపై విరక్తి చెందింది. దీంతో మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామ శివారులోని మంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యం కారణంగా ఒకరు..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఓ వృద్ధురాలు అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఎంటి లచ్చవ్వ (72) కొద్ది రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. ఎన్నిసార్లు ఆస్పత్రులలో చూయించుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు

- ఒకరికి గాయాలు


బస్సు కింద ఇరుక్కుపోయిన బైక్

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ శివారులోని 63వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఆర్టీసీ బస్సు ముందున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా.. మండలంలోని గుత్ప గ్రామానికి చెందిన గంగాధర్ బైక్‌పై నిజామాబాద్ వెళుతున్నాడు. మాణిక్‌భండార్ వద్ద ఆర్మూర్ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు అతడిని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగాధర్ కాళ్లు, చేతులు విరిగినట్లు స్థానికులు తెలిపారు. బస్సు కింద బైక్ ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

వ్యక్తిపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని కాల్‌పోల్ గ్రామంలో బోరుబావి వాడుకునే విషయమై ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రాము సోమవారం తెలిపారు. బస్సీ సడ్డాకు చెందిన బోరుమోటారును ప్రకాష్ వాడుకుంటున్నాడు. పైపు పగిలిపోవడంతో నీరు వృథాగా పోతున్నాయని సడ్డా ప్రకాష్‌కు చెప్పాడు. ఈ విషయంలో వారి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ప్రకాష్ సడ్డాపై దాడిచేయడంతో స్వల్పగాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రకాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.